


పాఠశాలలను ప్రత్యేక అధికారులు సందర్శించాలి

పార్వతీపురంటౌన్ : మై స్కూల్ మై ప్రైడ్ (నా బడి – నాకు గర్వకారణం) కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండు సార్లు సందర్శించాలన్నారు. విద్యార్థులకు ప్రేరణ కల్పించి విద్యపట్ల ఆసక్తి కలిగించడమే కాకుండా వెనుకబడిన అంశంలో అందెవేసిన చేయిగా తీర్చిదిద్దాలని ఆయన అన్నారు. టెన్త్ విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించడమే కాకుండా 8,9 తరగతుల విద్యార్థులకు కూడా మంచి సూచనలు సలహాలు ఇవ్వాలని చెప్పారు. గత రెండేళ్ళ టెన్త్ ఫలితాల్లో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, అదే స్థానం కొనసాగించేందుకు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షాలు

- రైతుల్లో పెరిగిన ఆశలు
- రిజర్వాయర్లలోకి చేరుతున్న నీరు



కురుపాంలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్

వాతావరణ మార్పుల వల్ల గత రెండు రోజులుగా మన్యం జిల్లాలో కురుస్తున్న వర్షాలు రైతన్నలకు ఊపిరిని ఇస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన చెదురుమదురు జల్లులతో నారుమళ్లను సిద్ధం చేసుకున్న రైతులు, ఆ తర్వాత వర్షాలు మందగించడంతో వారిలో ఆందోళన మొదలైంది. అయితే గత రెండు రోజులుగా జిల్లాలో అన్ని మండలాల్లోనూ కురుస్తున్న మోస్తరు వర్షాలకు కుంటల్లోనూ, చెరువుల్లోనూ నీరు చేరడంతో కర్షకులు దుక్కులకు సిద్ధమవుతున్నారు. గురువారం జిల్లాలోని 15 మండలాల్లోని వర్షపాతం వివరాలు పరిశీలిస్తే పార్వతీపురం, కొమరాడ మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో అత్యల్ప వర్షం కురిసినట్లు అధికార గణాంకాలు తెలిపారు. శుక్రవారంఉ దయం నుండి అన్ని ప్రాంతాల్లోనూ ఇదే మాదిరి వానలు కురుస్తున్నాయి. ఇదే వర్షపాతం మళ్లీ నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలియచేస్తున్నారు. రాబోయే రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో చెరువుల్లో నీరు చేరి ఉబాలు అనంతరం కాస్త

రిజర్వాయర్లకు జలకళ

గరుగుబిల్లి : గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రిజర్వాయర్లలో నీరు చేరు జలకళ కనిపిస్తోంది. ఇందులో భాగంగా గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర వద్ద గల తోటపల్లి రిజర్వాయర్‌లో శుక్రవారం నాటికి ఎఫ్ఆర్ఎల్ 105.00 మీటర్లు ఉంది. బ్యారేజి సామర్థ్యం 2.534 టిఎంసి. రిజర్వాయర్ లెవెల్ 1.897 టిఎంసి ప్రస్తుతం ఉంది. ఇన్‌ఫ్లో సామర్థ్యం 1175 క్యూసెక్కుస్, ఎల్ఎంసి 80 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 965 క్యూసెక్కులు, అలాగే ఓల్డ్ ఆర్ఎంసి 30 క్యూసెక్కులు, కొత్త ఆర్ఎంసి 100 క్యూసెక్కులు, అలాగే మొత్తం అవుట్ ఫ్లో 1175 క్యూసెక్కులు ఉన్నట్లు జెఇ కిషోర్ తెలిపారు. అలాగే పాచిపెంటలో గల పెద్దగెడ్డ రిజర్వాయర్ పూర్తిసామర్థ్యం 213.8 మీటర్ల వర్షపాతం కాగా, ప్రస్తుతం 213.6కు వరద నీరు చేరుకుంది. అలాగే వెంగళరాయసాగర్ ప్రాజెక్టులో 213.8 మీటర్లు సామర్థ్యం కాగా, 213.6 మీటర్లకు చేరుకుంది.



తోటపల్లి రిజర్వాయర్‌లో చేరిన వరదనీరు

చేనులకు నీరందుతాని రైతులు ఆశాభావంతో ఉన్నారు. ఈ విషయంపై జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ స్పందిస్తూ జిల్లాలో వర్షపాతం ఆశాజనకంగా ఉందని, రైతులు ఈ ఖరీఫ్ సీజను ఊబాలు ప్రారంభించుకోవడానికి ఈ వానలు ఊతమిస్తున్నాయని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికీ విత్తనాలు పూర్తిస్థాయిలో వారు కోరిన విధంగా అందించామని తెలిపారు. అలాగే ఎరువులు 45,277 టన్నులు అందించేందుకు సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఇప్పటికే ఎరువుల పంపిణీ అన్ని మండలాల్లోనూ ప్రారంభమైందని చెప్పారు.

వివిధ మండలాల్లో శుక్రవారం నమోదైన వర్షపాతం (మిల్లీమీటర్లలో) వివరాలు

వీరఘట్టం	17.8
సీతంపేట	20.6
భామిని	25.2
పాలకొండ	18.6
కొమరాడ	45.8
గుమ్మలక్ష్మీపురం	0.6
కురుపాం	16.4
జియమ్మ వలస	8.4
గరుగుబిల్లి	24.8
పార్వతీపురం	57.4
మక్కువ	23.6
సీతానగరం	19.8
బలిజిపేట	27.2
సాలూరు	23.8
పాచిపెంట	21.6

తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

సీతంపేట : అకాల వర్షాలు కారణంగా బంగాళాఖాతం ఏర్పడిన వర్షాలకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కౌంటర్ రూమ్ ఏర్పాటు చేసినట్లు స్థానిక తహశీల్దార్ మహేశ్వరరావు తెలిపారు. సిబ్బందిని అప్రమత్తం చేశామని గ్రామాల్లో దండోరా వేయించామని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులున్నా కంట్రోల్ రూమ్ నెంబర్ 9502722212 సంప్రదించాలని కోరారు.

వర్షాల పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తం: కలెక్టర్

పార్వతీపురం టౌన్ : వర్షాల పట్ల జిల్లా యంత్రాంగంగాన్ని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అప్రమత్తం చేశారు. విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఎంఎల్ హెచ్పి, సిహెచ్‌డబ్ల్యులతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆయన ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని తెలిపారు. వరదల సమయంలో పాము, తేలు కాట్లుకు ప్రజలు గురయ్యే ప్రమాదం ఉందని, వ్యాధులు ప్రబలేందుకు అవకాశం ఉందని, వాటి చికిత్సకు కావాల్సిన మందులు సిద్ధం చేసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను అదేశించారు. వర్షాల అనంతరం పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ఎటువంటి దుర్ఘటనలు సంభవించరాదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన అన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పాచిపెంటకు మంత్రి వరాల జల్లు

ప్రజాశక్తి – పాచిపెంట

మండల వాసులకు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వరాల జల్లులు కురిపించారు. ఎంపిపి బి.ప్రమీల అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు శాఖా సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు సభ్యులు లేవనెత్తిన సమస్యలపై స్పందించిన ఆమె మాట్లాడుతూ ఆరు పడకల పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆరోగ్య కేంద్రంగా మారుస్తానన్నారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, తాగునీటికి అధిక ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పెద్దగెడ్డ కాలువల్లో పూడికలు తొలగించి రైతులకు సాగునీరు విడుదల చేస్తామన్నారు. మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి తనవంతు నిధులు మంజూరు చేస్తానని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు ద్వారా పాంచాలి, మోసురు తదితర 15 గ్రామాలకు తాగునీరు అందడం లేదని పాంచాలి సర్పంచ్ యుగంధర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కోటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆర్ఆర్ ప్యాకేజీ కింద ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని, గరేళ్లవలసలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. పాచిపెంట సర్పంచ్ సంతోషిని, ఎంపిటిసి సభ్యులు పల్లేడ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలో అవకతవకలు జరిగాయని, దర్యాప్తు చేపట్టాలని, జల్ జీవన్ పథకం కింద గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల పలువురు ప్రజాప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో నూతన పాఠశాల భవనాలు నిర్మించి తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు. సభ్యుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కె.సింహాచలం, ప్రత్యేక అధికారి శివప్రసాద్ ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, తహశీల్దార్ పి.బాల, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అనంతరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంత్రి గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రీవెన్స్‌లోనే పలువురి అర్జీదారుల సమస్యలను మంత్రి తీర్చారు. గత ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా జరగలేదని పలువురు అర్జీదారులు హర్షం వ్యక్తం చేశారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలని మంత్రికి వినతి

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా గ్రంథాలయానికి ఎదురుగా ఉన్న వైన్ షాపును వెంటనే తొలగించాలని కోరుతూ మంత్రి సంధ్యారాణికి డివైఎఫ్ఐ, సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాచిపెంట మండల కేంద్రం ఎంపిడిఒ కార్యాలయం వద్ద వినతిని అందజేశారు. డివైఎఫ్ఐ నాయకులు కొండంగి చిరంజీవిరావు, గిరిజన సంఘం నాయకులు కొర్ర కల్యాణ్, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో వినతిని అందజేశారు.

నిత్యవసర సరుకుల దుకాణాన్ని ప్రారంభించిన మంత్రి

సామాన్యులకు తక్కువ ధరలకే నిత్యవసర సరుకులు పంపణీ చేసే దుకాణాన్ని మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాచిపెంట చిన్న బజారులో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాయితీపై పప్పు, బియ్యం ప్రజలకు ఆమె అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత వైసిపి పాలనలో నిత్యవసర సరుకుల ధరలు ఆకాశానంటాయని, దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు నిత్యవసర సరుకులు కొనుగోలు చేయలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ధరల నియంత్రణలో భాగంగా పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరలకే నిత్యవసర సరుకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మేరకు టిడిపి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పి.ప్రసాదబాబు, సర్పంచులు గూడెపు యుగంధర్, పి.సంతోషిణి, కె.సత్యవతి, పూసర్ల నర్సింగరావు, పల్లెడ ఉమా, చల్లా కనక, కె.సురేష్ తహశీల్దార్ పి.బాల పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సుఖప్రసవాలు జరగాలి

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

గిరిజన గ్రామాల్లో గర్భిణీలు సుఖప్రసవాలు జరిగేలా ముందుగానే వసతి గృహాల్లో హాజరుకావాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని గిరిశిఖర గ్రామమైన నోంద్రుకోన, పెంగవ, రేగిడిలో కలెక్టరు పర్యటించారు. జోరుగా వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా కలెక్టర్ గ్రామాల్లో ముందుకు సాగారు. నోంద్రుకోనలో గ్రామస్తులు కలెక్టరుకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా ప్రజలకు అందిస్తున్న అన్ని పథకాల అమలు తీరును తనిఖీ చేశారు. పారిశుద్యం, వైద్యశిబిరం, అంగన్వాడీ కేంద్రం, వ్యవసాయపనులు, పాఠశాల, మంచినీటి సరఫరా తనిఖీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశిబిరంలో గర్భిణులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరుపుకోవాలని, రిస్కు తీసుకోకుండా ప్రసవ తేదీకి ముందుగానే వసతిగృహాల్లో చేరాలని తెలిపారు. రక్తహీనతరాకుండా వారికి అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. గ్రామంలో పారిశుధ్య వారోత్సవాల్లో పాల్గొని, గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్యపనులను పరిశీలించారు. అనంతరం గిరిజనులకు దోమతెరలను పంపిణీ చేశారు. పొలంపనులను పరిశీలించి, రైతులకు పంపిణీ చేసిన విత్తనాలు గూర్చి కలెక్టర్ వారిని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రం తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలను, తరగతులు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి, అత్యంత నిబద్ధతతో బోధించాలని, విద్యార్థులకు చక్కని విద్యను అందించాలని, పాటలు రూపంలో పాఠ్యాంశాలను నేర్పాలని, వారిలో సహజ నైపుణ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించి, డయేరియా సంభవించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పెంగవ, రేగిడి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ శివకుమార్, డిఎంఒ డా.జగన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అపారిశుధ్యం లేకుండా చూడాలి
జోరు వానలో సాగిన కలెక్టర్ పర్యటన



గిరిజన గర్భిణులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం : ఎస్‌పి

ప్రజాశక్తి – పార్వతీపురం రూరల్



జిల్లాలో పూర్తి స్థాయిలో నేరాలు అరికట్టడమే కాకుండా గంజాయి నాటు సారా మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కు పాదం మోపుతామని ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం నూతన జిల్లా పోలీసు అధికారిగా ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు సత్యసాయి జిల్లా ఎస్పీగా పని చేసిన తాను ఈ జిల్లాకు రావడం తనకు ఆనందంగా ఉందని అన్నారు. జిల్లాపై అవగాహన పెంచుకొని విస్తృతంగా పర్యటించి, గంజాయి, నాటు సారా వంటి మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కు పాదం మోపుతామని, అలాగే జిల్లాలో నేరాల సంఖ్య తగ్గించడమే కాకుండా శాంతిభద్రతల పరిరక్షణకు సిబ్బందితో కలిసి సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానని అన్నారు. ఎఎస్‌పిలు డాక్టర్ ఓ.దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, సిఐలు సిహెచ్. లక్ష్మణరావు, బిఎండి ప్రసాద్, కృష్ణారావు, రవికుమార్, ఎస్ఐలు, పలువురు సిబ్బంది ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ

మన్యం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ మాధవరెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, జిల్లా అభివృద్ధికి తనతో కలిసి రావాలని కోరారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

మన్యం జిల్లాను జాయింట్ యాక్షన్ ప్లాన్ ద్వారా ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలతో డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సారధ్యంలో బాలలు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు నియంత్రణ చర్యలు గురించి, జిల్లాలో బాలలతో పనిచేస్తున్న కీలక ముఖ్య శాఖలైన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, పోలీసు శాఖ, విద్యా శాఖ, ఎక్సైజ్ శాఖ, సాంఘిక సంక్షేమశాఖ, పంచాయత్ రాజ్, మున్సిపల్ శాఖ, సమాచార, పౌర సంబంధాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య,ఆరోగ్య శాఖ, రైల్వే మొదలగు శాఖలకు సంబంధించి ఉన్నతాధికారులతో డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు ఆధ్వర్యాన సమీక్షించారు. ఈ సమీక్షలో జిల్లాలో డ్రగ్స్ నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలను వివిధ శాఖల అధికారుల ద్వారా పూర్తి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే చేపట్టాల్సిన నియంత్రణా చర్యలు వివరించారు. ఈ సందర్భంగా మెడికల్ షాప్‌లు, మద్యం దుకాణాల్లో తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల సహకారంతో ఎటువంటి చర్యలు చేపడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. డ్రగ్స్ నియంత్రణకు మరికొన్ని ప్రత్యేక కౌన్సిలింగ్ విధానాలు, పునరావాస కేంద్రాలు, డి–ఎడిక్షన్ కేంద్రాల ఏర్పాటుతో పాటు పాఠశాలలు, కళాశాలలు, వివిధ పునరావాస కేంద్రాలు, వసతి గృహాల్లో మనస్తత్వ వేత్తల నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఇలాంటి సమీక్షా సమావేశాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించి ప్రభుత్వ శాఖల సమన్వయంతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పిల్లలకు చక్కని ఫలితాలు అందించే దిశగా అడుగులు వేస్తున్నట్టు అప్పారావు, సీతారాం లు చెప్పారు. సమావేశంలో ఐసిడిఎస్ ఎంఎన్ రాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ, పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అప్పారావు

కిండంగిలో డెంగీ

ప్రజాశక్తి–సీతంపేట

మండలంలోని కిండంగిలో డెంగీ కేసు నమోదైంది. సవర ప్రదీప్ పాలకొండ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతు డిశార్చ్ అయినట్లు అధికారులు తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు కిండంగిలో ఐఆర్ఎస్ ఐఎస్ఎస్ ఇండోర్ రీ షెడ్యూల్ స్ప్రే ద్రావణం పిచికారీ చేశారు. దోమల నివారణకు చర్యలు ప్రత్యేకంగా చేపట్టారు.

మలేరియా నివారణకు చర్యలు తీసుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి – కురుపాం

మలేరియా నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జియ్యమ్మ వలస మండలం రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నెలలో ఐదు మలేరియా కేసులు నమోదయ్యావని, వర్షాలు ఎక్కువ పడుతున్న నేపథ్యంలో గిరిజన ప్రజలు మలేరియా, టైఫాయిడ్ వ్యాధులతో బాధపడి ఆసుపత్రిలో చేరుతున్నారని కావున ప్రభుత్వం మలేరియా వ్యాధి నిర్ధారణ పరికరాలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మలేరియా రోగులకు పౌష్టిక ఆహారాన్ని అందించేందుకు ప్రతి రోగికి 10 కేజీ కందిపప్పు, 20 కేజీ ల బియ్యం ఉచితంగా అందించాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి ప్రజలకు అవగాహన కల్పించి పిహెచ్‌సి పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఆదివాసీల ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎం. రమణ, సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు పువ్వల తిరుపతిరావు, కె.బలరాం తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగిని పరామర్శిస్తున్న సురేంద్ర

గిరిజన వర్సిటీని తరలిస్తే జిల్లాకు అన్యాయమే

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి – సాలూరు

నియోజకవర్గం లో ఏర్పాటు చేసిన గిరిజన యూనివర్సిటీ ని కొత్తవలసకు తరలిస్తే జిల్లాకి అన్యాయం చేసినట్టే నని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం హయాంలో గిరిజన యూనివర్సిటీని కొత్తవలసలో ఏర్పాటు చేశారని చెప్పారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి ప్రభుత్వం హయాంలో గిరిజన ప్రాంతంలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి పట్టుబట్టారని చెప్పారు. ఈ మేరకు సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండలంలో ఏర్పాటుకు కేంద్రం అంగీకరించిందన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం మళ్లీ గిరిజన యూనివర్సిటీని కొత్తవలసకు తరలించే యోచనలో వున్నట్టు ఊహాగానాలు వస్తున్నాయని చెప్పారు. అదే జరిగితే జిల్లాకు కి తీరని అన్యాయం చేసినట్టేనని అన్నారు. ఒకవేళ గిరిజన యూనివర్సిటీ ని కొత్తవలస కి తరలిస్తే వైసిపి ఏం చేస్తుందని ప్రశ్నించగా నియోజకవర్గంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వుండగా ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. ఇటీవల జెడ్పీ సమావేశంలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించగా గిరిజన యూనివర్సిటీ మెంటాడలోనే వుండేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఎన్నికల ముందు టిడిపి ప్రజలకు ఇచ్చిన హామీ లు ఉత్తుత్తి హామీలు కాకూడదని అన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నామని చెపుతూ ట్రాక్టర్ ఇసుక రూ.3వేలకు విక్రయించడం తగదన్నారు. ఉచిత ఇసుక పై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే వైసిపి నాయకులు కార్యకర్తలు, ఎంపీలపై దాడులు చేయడం చూస్తుంటే ప్రజాస్వామ్యంలో వున్నామా లేదా అనే అనుమానం వస్తోందని చెప్పారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మార్పునకు సంబంధించిన పెద్ద మనుషుల ఒప్పందంపై ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని, రాతపూర్వకంగా జరగలేదని చెప్పారు. దీనిపై కొంతమంది పట్టణ నాయకులు అలకవహించారని ప్రస్తావించగా పార్టీలో అలాంటి పరిస్థితి లేదని, నాయకులంతా కలిసి వున్నారని చెప్పారు. రాజన్నదొర మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు నెలలు కాకముందే వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఎంపీలపై దాడులు చేయడాన్ని ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి సీరియస్‌గా తీసుకుని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని మాజీ కోరారు. టిడిపి నాయకులు వైసిపి శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు డోల బాబ్జీ, దండి శ్రీనివాసరావు, మావుడి రంగు నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలి

ప్రజాశక్తి – కురుపాం

ప్రతి విద్యార్థికి ఉత్తమ విద్యను అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాల వద్ద ఎంఇఒ ఎన్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కంబరలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం

మండలంలోని కంబరలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ కుమార్ జ్వర పీడితులతో పాటు వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో కోటదుర్గ ఆలయ సమీపంలో అన్నా కెంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. గతంలో అన్నా కెంటీన్ కోసం నిర్మించిన భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. ఆగస్టు 15 నుంచి అన్నా కెంటీన్ ప్రారంభమవుతుందని చెప్పారు. నీటి సదుపాయం ఉందా లేదా అనే విషయాన్ని కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, టిడిపి మాజీ ఇన్-ఛార్జ్ నిమ్మక పాండురంగ, మండల, పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, గంటా సంతోష్, సుంకరి అనిల్, వెన్నపు శ్రీనివాస్ రావు, తమ్మారావు ఉన్నారు.


సీతానగరంలో రోగులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి హేమాక్షి

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బత్తిలి పిహెచ్‌సి వైద్యులు కొండపల్లి రవీంద్ర ఆధ్వర్యంలో జియమానుగూడలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన డెంగి, మలేరియా లక్షణాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ప్రభుత్వం అందించిన దోమ తెరలు వాడాలని తెలిపారు.

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురంలో వైద్యాధికారి టి.హేమాక్షి ఆధ్వర్యానఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపైనా, వర్షా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, ఆయాసం, వాత నొప్పులు, మూల వ్యాధి, చర్మ రోగాలకు సంబంధించి మందులు పంపిణీ చేశారు. కార్య క్రమంలో ఆయుష్ సిబ్బంది, స్టాఫ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్యాలు ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ముత్యాలూ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. విద్యార్థుల సామర్థ్యం తెలుసుకున్నారు. రికార్డులను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారానని హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సిఎంఒ చిరంజీవిలు తదితరులు పాల్గొన్నారు

తక్కువ ధరకే పవర్ వీడర్

ప్రజాశక్తి - కురుపాం


రైతుకు పవర్‌వీడర్‌ను అందజేస్తున్న అధికారులు

రైతు ఉత్పత్తి దారుల సంఘం ద్వారా తక్కువ దొరికే వ్యవసాయ పవర్ వీడర్‌లను రైతులకు అందజేస్తున్నట్లు నేటివ్ ఇకో ఆర్గానిక్ రూట్స్ ఉద్యాన ఎఫ్‌పిఒ, సిఇఒ వినోద్ కుమార్, సోనియా అన్నారు. మండలంలోని మేదర గండ గిరిజన రైతులకు పవర్ వీడర్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పవర్‌వీడర్, స్ప్రేయర్లు, టార్పలిన్స్ రైతులకు కావాల్సిన వ్యవసాయ పరికరాలను తక్కువ, సబ్సిడీ ధరలకు ఇప్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


గిరిజన యువతకు కిట్లను అందజేస్తున్న ఎస్ఐ నరసింహమూర్తి

యువతకు క్రీడా కిట్లు అందజేత

ప్రజాశక్తి - మక్కువ

గిరిజన యువతను క్రీడలపై ప్రోత్సహించేందుకు పలు క్రీడా కిట్లను ఎస్ఐ పి.నరసింహమూర్తి అందజేశారు. మండలంలోని ఆలగురువు, గుంటభద్ర, మూలవలస, పనసభద్ర గిరిజన గ్రామాల్లో ఫ్రెండ్లీ పోలీస్ విధానం గురించి యువతకు, ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

మన్యంలో ముసురు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గత మూడు రోజులుగా ముసురు పట్టింది. భారీ వర్షాలతో విద్యార్థులు, వ్యాపారాలు, ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కురుస్తున్న వర్షాలతో పొలాలు, చెరువులు నీటితో నిండాయి. ఒకవైపు పొలం పనులు జోరుంచుకున్నాయి. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఎడతెరుపులేని కురుస్తున్న వర్షాలతో గుమ్మలక్ష్మీపురం ఎల్విన్ పేట రహదారి బురదమయంగా మారడంతో ప్రజలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఆదర్శ పాఠశాలలో ఎన్‌సిసి కేడెట్ల ఎంపిక

ప్రజాశక్తి - భామిని

స్థానిక ఆదర్శ పాఠశాలలో జూనియర్ డివిజన్ ఎన్ సి సి శిక్షణకు కేడెట్ల ఎంపికను శ్రీకాకుళం 14 ఆంధ్ర ఆర్మీ బెటలియాన్ వారు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు ఫిజికల్, మెడికల్ పరీక్షలు నిర్వహించి, 45 మంది విద్యార్థులను జూనియర్ సబ్ డివిజన్ ఎన్‌సిసి శిక్షణకు కేడెట్లుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్.శివకుమార్, వ్యాయమ ఉపాధ్యాయులు శివరాం ప్రసాద్,ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.



ఎన్‌సిసికి ఎంపికైన విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత : జెసి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుని సామాజిక బాధ్యత అని జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక అన్నారు. మండలంలోని లక్ష్మీనారాయణపురంలో జరుగుతున్న పారిశుధ్య పక్షోత్సవాల్లో పాల్గొని కార్యక్రమాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. 3, 6 క్లస్టర్లలో జరుగుతున్న పనులను ఇఒపిఆర్‌డి జి.రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి నరేంద్రతో కలిసి పరిశీలించారు. పరిసరాల శుభ్రత ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత అందరిపైనా ఉందని, అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన నిరోధించడం వంటి కార్యక్రమాలు చేపట్టే గలిగితే డయేరియా వంటి రోగాల నుంచి గ్రామీణులను దూరం చేయవచ్చని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని 27, 28వ వార్డుల్లో దంగిడి వీధిలో పారిశుధ్య కార్మికులతో గ్యాంగ్ వర్క్స్, డిసిల్టింగ్ పనులు, యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ తదితర పనులు కమిషనర్ కె.శ్రీనివాస్ నిర్వహించారు. అనంతరం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.మురళి, శానిటరీ, హెల్త్ సెక్రెటరీలు, మేస్త్రీ పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కిండంగిలో పారిశుధ్యపక్షోత్సవాలు మండల ప్రత్యేకాధికారి ఎస్.సింహాచలం, ఎంపిడిఒ గీతాంజలి ఆధ్వర్యంలో పరిసర పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీంద్ర, సింగయ్య, మహిళా పోలీస్ అరుణ, ఎఎన్ఎం నీలమ్మ ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని కళ్లికోటలో ఎంపిడిఒ మల్లికార్జునరావు ఆధ్వర్యాన గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏవో రమేష్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, సర్పంచ్ దత్తి మురళి, ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద, పంచాయతీ కార్యదర్శి నరేష్, టిడిపి నాయకులు కిషోర్ , వైద్య సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది పలు శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.


సీతంపేట : కిండంగిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


ఎల్ఎన్ పురంలో పర్యటిస్తున్న జెసి శోభిక

భామిని:మండలం లోని బత్తిలి కాలనీలో పారిశుధ్య పక్షోత్సవాలు నోడల్ అధికారి ఎం.శశికుమార్ ఆధ్వర్యాన నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ పనులు చేపట్టాలని పంచాయతీ, వైద్య సిబ్బంది ని సూచించారు.

సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పక్షోత్సవ ర్యాలీలను అన్ని పంచాయతీల్లో నిర్వహించారు. పెద్దబోగిలిలో సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ ఆధ్వర్యంలో అన్ని వీధుల్లోనూ ర్యాలీలు నిర్వహించారు. పణుకుపేట, గాదిలివలస, అంటిపేట, రామవరం, నిడగల్లు, సుమిత్రా పురం తదితర గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, అంగన్వాడీ సిబ్బందితో అన్ని గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు.

రోడ్డుపై గోతులను కప్పాలి

ప్రజాశక్తి - కొమరాడ

రోడ్డుపై గోతులను పూర్తిస్థాయిలో కప్పి ప్రమాదాలను నివారించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎట్టకేలకు స్పందించిన ఆయుర్వేదికలు గుమ్మడి వద్దనున్న గోతులను కప్పుతుండగా సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ ఆర్ఎంపి అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో కోటిపాం నుంచి కూనేరు వరకు గల అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను కప్పి ప్రమాదాల నివారించాలన్నారు. పూర్తిస్థాయిలో రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు ప్రస్తుత వర్షాకాలం కావడంతో అవకాశం లేదని, కావున అధికారులు ప్రమాదాల నివారించేందుకు వాహనదారుల ఇబ్బందులు తప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా రోడ్డుపై ఉన్న భారీ గోతులను కప్పితే వాహనాల రాకపోకలకు ప్రస్తుతం ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుందని అన్నారు. ఆర్ఎంబి అధికారులు ఆ దిశగా రోడ్డుపై ఏర్పడిన పెద్ద గోతులను కప్పి తాత్కాలికంగా వాహన రాకపోకలను కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం గుమడ వద్ద ఏర్పడిన గోతుల వద్ద ఆర్ఎంబి జెఇ రాజేంద్ర ఆధ్వర్యంలో గోతులు కప్పేందుకు చర్యలు చేపట్టారు. గోతులు కప్పే సమయంలో కొంతమేరకు ట్రాఫిక్‌కు అంతరాయంతో స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

శివారు భూములకు నీరందిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదంకలాం నీటి ప్రాజెక్టు ద్వారా చివర భూమి రైతులకు నీరందేలా ప్రయత్నిస్తామని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని పెదంకలాం కాలువ నీటిని ఎమ్మెల్యే బోనెల శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలిజిపేట, వంగర మండలాల్లోని 8,250 ఎకరాలకు సాగునీరందించేందుకు దీన్ని విడుదల చేశామన్నారు. చివర భూమి రైతులకు నీరందేలా గట్టి ప్రయత్నం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఎంతోకాలంగా అభివృద్ధికి దూరంగా ఉన్న కాలువను బాగు చేయించి ఆయకట్టు రైతులకు అండగా నిలిచేందుకు టిడిపి ప్రభుత్వం అన్ని వేళలా ముందుంటుందన్నారు. సుమారు రూ.18 కోట్లు జైకా నిధులు ఏమయ్యాయో ఎలా ఖర్చు చేశారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఆ నిధులు ఖర్చు చేసుంటే ప్రాజెక్టు చివర భూమి రైతుకు సాగునీరందేన్నారు. నిధులు స్వాహా చేసిన అధికారులపై వేటు తప్పదని, క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణుగోపాల నాయుడు, బి.రామ్మోహన రావు, గౌరు నాయుడు, మండల పెదపాపి నాయుడు, ఎం.అప్పారావు, బంకపల్లి సింహాచలం, డిఇ తిరుమలరావు, ఎఇ కవిత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర


బురదమయమైన సీతానగరం రోడ్డు

వర్షంతో రోడ్లు బురదమయం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లు బురదమయంతో మునిగిపోయాయి. సీతానగరం నుంచి వచ్చే రహదారి పూర్తిగా బురదమయంతో ఎక్కడెక్కడ గోతులు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సీతానగరం, బొడ్డుపేట, లక్ష్మీపురం, బూర్జ తదిత గ్రామాల్లో రోడ్డుమీద నీరు నిల్వ ఉండడంతో బురద ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా కాలువల్లేకపోవడంతో రోడ్డు మీదే నీరు ప్రవహించడంతో రోడ్లన్నీ బురదమయ్యాయి. ఈ బురదతో ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాక నీరు నిల్వ ఉండడంతో ప్రజలు దోమల బారిన పడి వ్యాధులకు గురవుతామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పారిశుధ్యంపై ప్రభుత్వం ఇన్ని ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ఫలితం ఉండదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేసి, రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం అవుతుందని ప్రజలు చెబుతున్నారు.

వర్షం పడితే నరకమే

పాలకొండ : మండలంలో గుడివాడ రహదారి అధ్వానంగా ఉంది. వర్షం పడితే ఈ రోడ్డుపై ప్రయాణించడం నరక యాతనే. గుడివాడ నుండి ఓని మీదుగా పాలకొండ వరకు సుమారు 6కిలో మీటర్ల మట్టి రోడ్డు ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోడ్డుపై నడవాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులుగా దాలినాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి మన్యం జిల్లా అధ్యక్షులుగా వంగల దాలి నాయుడు మరోమారు ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం విజయనగరంలో జరిగిన ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ నియామకంలో జిల్లా అధ్యక్షుడిగా మళ్లీ వంగల దాలి నాయుడును ఎంపిక చేసినట్లు అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు జాగారపు ఈశ్వర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు తదితరులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం జిల్లా గతంలో అధ్యక్షులుగా గతంలో పనిచేసి చక్కని ఫలితాలు సాధించారన్నారు. అందుకే మళ్లీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశామన్నారు. అనంతరం దాలినాయుడు మాట్లాడుతూ మన్యం జిల్లాలో చెరువులు, గెడ్డలు తదితర నీటి వనరుల పరిరక్షణకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అలాగే జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలతో పాటు 15 మండలాల్లో కమిటీలను త్వరలో నియమిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు అభినందించారు..


ఎమ్మెల్యే విజయచంద్రను సత్కరిస్తున్న జ్యోతి ఐటిఐ కరస్పాండెంట్ మురళి

ఎమ్మెల్యేను కలిసిన జ్యోతి ఐటిఐ కరస్పాండెంట్

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక జ్యోతి ఐటిఐ కరస్పాండెంట్ కె.మురళి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన మురళి దుస్సాలువాతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఐటిఐ కరెస్పాండెంట్ మురళి మాట్లాడుతూ మన్యం జిల్లాలో వృత్తి విద్యా కోర్సుల అభివృద్ధిలో భాగంగా ఐటిఐ పరీక్షా కేంద్రం జిల్లాలో లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున జిల్లా కేంద్రంలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు.

ఎస్‌పిని కలిసిన సిఐ, ఎస్ఐ

కురుపాం : మన్యం జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మాధవరెడ్డిని ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ, కురుపాం ఎస్సై షణ్ముఖరావు ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జీవ ప్రాజెక్టును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రైతులు జీవ ప్రాజెక్టును సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డిడిఎం సాధు దినేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొరడ, రాయగడ జమ్ము, పెంగవ, బాతుగుడబ గ్రామాల్లో నాబార్డ్ సహకారంతో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను ఆయన పరిశీలించారు. ముందుగా గొరడలోని తాడంగి బంగార్రాజు, పెంగవ లోని పువ్వల ఈలె, రాయగడ జమ్ములోని పువ్వల లక్ష్మి, పువ్వల సరోజని, పువ్వల శ్రీను, బాతుగుడబలోని కిల్లక వెంకటేష్, కిల్లక రాజారావు,జీవా రైతుల క్షేత్రాలను పరిశీలించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న కార్యక్రమాలు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఆయన గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే తమకున్న మొత్తం విస్తీర్ణంలో ఏడాది పొడవునా పంటలు పండించుకోవాలని, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా జీవన స్థితిగతులు మెరుగుపరుచుకోవాలని అన్నారు. భూ విస్తరణలో భాగంగా ఈ ఏడాది 11 గ్రామాల నుండి 150 మంది మాతోట రైతులను ఎంపిక చేసి జీవా కార్యక్రమాలు అమలు జరుగుతుందని జట్టు ట్రస్ట్ ముఖ్య సలహాదారు డాక్టర్ డి.పారినాయుడు తెలిపారు. రైతులంతా

ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సిబ్బంది రైతుల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్, కో-డైరక్టర్ ఎం.నూకం నాయుడు, జీవా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.ప్రాబోధ్, కోఆర్డినేటర్లు మురళీమోహన్, జి.గోవిందరావు, శివ, శ్రీహరి, రామారావు, సుబ్రహ్మణ్యం, సంతోషి, ప్రశాంత్, కిల్లక వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


గొరడలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

22న సాలూరులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను ఈనెల 22న (సోమవారం) సాలూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలు సమర్పించవచ్చని ఆయన చెప్పారు. జిల్లా అధికారులు అంతా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలిగిస్తాం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కొమరాడ

కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలిగిస్తామని జంఝావతి రిజర్వాయరు ప్రాజెక్టు కార్యనిర్వాహక ఇంజనీరు జగదేశ్వరరావు తెలిపారు. జంఝావతి జలాశయం నుండి ఈ ఖరీఫ్ సీజనుకు ఈనెల 4న రబ్బరు డ్యామ్ ఉపయోగించి కాలువలకు నీటిని విడుదల చేశామని తెలిపారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలు అన్న శీర్షికతో ప్రజాశక్తితో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ ఖరీఫ్ సీజన్లో కాలువలోని నీటి ప్రవహానికి ఆటంకం లేకుండా ఉండటానికి లోలెవెల్ కాలువ పరిధిలో సుమారు రూ.17.30 లక్షల అంచనా వ్యయంతో కాలువ పైన పేరుకుపోయిన గుర్రపుడెక్క, గడ్డి వగైరాలు తొలగించడానికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఈ సీజన్లో నీరు సరఫరా చేయుటకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు..

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దు

ప్రజాశక్తి - కొమరాడ

ఆటోలపై మితిమీరిన ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణించడం నేరమని జిల్లా రవాణా శాఖ అధికారి రమేష్ అన్నారు. మండలంలోని కోటిపాం హైస్కూల్ సమీపంలో అంతర్ రాష్ట్ర రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు రవాణా శాఖ అధికారులు ఒడిశా నుంచి వస్తున్న వివిధ వాహనాలను పరిశీలించారు. అనంతరం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మితిమీరిన వేగంతో పాటు అధికంగా వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణించడం చట్టరీత్యా నేరమన్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే బాధిత కుటుంబాలకు ఎటువంటి ఇన్సూరెన్స్ క్లెయిమ్ అవ్వని చెప్పారు. అలాగే తప్పకుండా ఆటో, క్యాబ్ డ్రైవర్లకు లైసెన్సులు ఉండాలని స్పష్టం చేశారు.



నదీతీరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నదీ తీర ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా గత కురుస్తున్న వర్షాలకు నాగావళి నదిలో నీటి ప్రవాహం అధికమైంది. దీంతో శుక్రవారం మండలంలోని బిటివాడ గ్రామ నదీ తీరప్రాంతాన్ని తహశీల్దారు, ఎంపిడిఒ కె.జయప్రకాష్, ఎంవిబి సుబ్రహ్మణ్యం పరిశీలించారు. రాత్రి సమయంలో నది వద్దకు ఎవర్నీ రానీయవద్దని, నదీ తీర ప్రాంతాల విఆర్‌ఒలను ఆదేశించారు. నది ప్రవాహంపై ఎప్పటికప్పుడు తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వీరితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల పట్ల జాగ్రత్తలు పాటించాలి


ప్రజాశక్తి - సీతానగరం

పాడి పశువులపై రైతులు జాగ్రత్తలు వహించాలని పశు సంవర్ధక శాఖ ఎడి సిహెచ్ దీనీకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పాడి పశువులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడిసిన దాణాను పశువులకు మేత పెట్టరాదన్నారు. అలా చేస్తే పశువులకు విరేనాలు వచ్చే పరిస్థితి ఉంటుందని తెలిపారు. అలాగే విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టరాదన్నారు. ఈ జాగ్రత్తలు పాటిస్తే పశువులు ఎటువంటి వ్యాధులకు గురికాకుండా ఉంటాయని తెలిపారు. పశువుల మేతల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు సూచించారు. ఆయనతోపాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

కుళాయి పాయింట్లలోకి చేరిన మురుగునీరు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక రక్షిత మంచినీటి పథకం ద్వారా మేజర్ పంచాయతీ ప్రజలకు తాగునీరు సరఫరా అవుతుంది. అప్పట్లో మురికి కాలువలకు పక్కన రక్షిత మంచినీటి పైప్ లైన్లు ఏర్పాటు చేశారు. ఇందులో భాంగా మండల కేంద్రంలోని కస్పా వీధి నుండి అక్కుల పేట వీధి వరకు కుళాయి పాయింట్లు ఉన్నప్పటికీ వాటికి ట్యాపులు ఏర్పాటు చేయకపోవడంతో కాలువ మురికి నీరంతా కుళాయి పాయింట్లోకి చేరిపోతుంది. ప్రతిరోజు ఉదయం పూట విడిచిపెట్టి నీరుతో పాటు మురికినీరు అందులో చేరుకోవడంతో మంచినీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు మెండిగా ఉన్నాయి. మేజర్ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఈ ప్రాంత ప్రజలు మంచాలు పట్టి ప్రమాదం ఉంది.


కుళాయి పాయింట్లోకి చేరుతున్న మురుకు నీరు